క్లుప్తంగా

జంగిల్ తొలగింపు



బాలసీమ వద్ద బాగుచేసిన సాగునీటి కాలువ

నరసన్నపేట: మండలంలో సాగునీటి కాలువల్లో జంగిల్ తొలగింపు పనులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. ఉపాధి పనుల్లో భాగంగా వేతనదారులు కాలువల్లో జంగిల్‌ను తొలగించే పనులు చేస్తున్నారు. మండలంలో ఇప్పటి వరకు 68 కాలువల్లో జంగిల్ తొలగించినట్లు ఏపీఓ యుగంధర్ తెలిపారు. అన్ని కాలువలను బాగు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య



అన్నపురంలో కళాశాలలో చేరాలని విద్యార్థిని కోరుతున్న కళాశాల సిబ్బంది

సారవకోట: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 10వ తరగతి పాసైన విద్యార్థులను చేర్పించాలని సారవకోట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ వి.సుశీల్‌కుమార్ కోరారు. తమ సిబ్బంది విద్యార్థులను చేర్పించడం కోసం గ్రామాలలో విద్యార్థుల తల్లిదండ్రులను కలుస్తున్నారన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులున్నాయని 10వ తరగతి పాసైన విద్యార్థులు 10వ తరగతి మార్కుల మెమో తీసుకొచ్చి ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు రూ.2,400, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులకు రూ.1,300 చొప్పున చెల్లించి కళాశాలలో చేరవచ్చునన్నారు. కళాశాలలో అన్ని మౌలిక వసతులతోపాటు ఐఎఫ్‌పీ ప్యానల్స్ ఉన్నాయన్నారు.

నీలమణిదుర్గ అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు



నీలమణిదుర్గ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: ఉత్కలాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణి దుర్గ అమ్మవారికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం పూజలు చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత అమ్మవారిని దర్శించుకుని కుంకుమ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ వాసుదేవరావు ఆహ్వానించారు. అలయ గుమస్తా సుదర్శనరావు, అర్చకులు టి.రాజేష్, సంతోష్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



చిత్రలేఖనం పోటీలను నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి అనురాధ

మెళియాపుట్టి: వేసవిలో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి అనురాధ అన్నారు. ఆమె బుధవారం ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. విద్యార్థుల మానసిక వికాసానికి, పుస్తకాలు మూలస్తంభాలుగా నిలుస్తాయన్నారు. చిత్రలేఖనం ద్వారా చక్కటి ప్రతిభ పెరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, విద్యతో పాటు చిత్రలేఖనంలో కూడా ప్రావీణ్యం పొందాలన్నారు. పుస్తక పఠనం ద్వారా మేధస్సును పెంపొందించుకోవాలన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు దేవరకొండ శంకరనారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామికి పాలతో అభిషేకాలు నిర్వహించి స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మొక్కలతో మానవ మనుగడ

- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం
- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వక్తల పిలుపు

సారవకోట: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం కార్యాలయ సూపర్వైజర్లు మొక్కలు నాటారు. పర్యావరణానికి మొక్కలు ఎంతో మేలు కలిగిస్తాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. సూపర్‌వైజర్లు సుజాత, పద్మ, సునీత, సీతారత్నం ఉన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సత్యవరం ఉన్నత పాఠశాల హెచ్ఎం వకులరత్నమాల అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్కూల్ ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పర్యావరణం ఎటువంటి ప్రమాదంలో ఉంది, పర్యావరణాన్ని ఎలా రక్షించుకోవాలో వివరించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ఉపాధ్యాయులు కేశవరావు, లక్ష్మణరావు, భామారావు తదితరులు పాల్గొన్నారు. నరసన్నపేట కోర్టు ఆవరణలో న్యాయవాదులు కొండలరావు, తూలుగు మధు తదితరులు మొక్కలు నాటారు. కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలస రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సత్యసాయి సమితి కన్వీనర్ చిడిపోతు సూర్యారావు పిలుపునిచ్చారు. మండలంలో అక్కులపేట గ్రామంలో గల సత్యసాయి మందిరం వద్ద అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న వాతావరణంలో వేడిని తగ్గించాలంటే అందరూ మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మొక్కలు అంతరించిపోవడం వల్ల వర్షాలు పడక పంటలకు తీవ్ర నష్టం జరుగుతుందని, అందుకు శుభ కార్యక్రమాలు చేసే సమయంలో మొక్కలు నాటుకోవడం అలవాటుగా మారాలని సూచించారు. జోనల్ యూత్ కో ఆర్డినేటర్ పవన్, నదియా, బాలవికాస్ గురువు సంజన, అనూష, సాయి సిద్దు, సాయి ఢిల్లీ పాల్గొన్నారు.



సారవకోట: మొక్కలు నాటుతున్న సూపర్‌వైజర్లు

పాతపట్నంలో..

పాతపట్నం: మొక్కలు నాటడమే కాకుండా సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పాతపట్నం అంగన్‌వాడీ సీడీపీఓ విమలరాణి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పాతపట్నం సెక్టర్-2 సెంటర్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. పీఓ మాట్లాడుతూ మనిషికి మొక్కలే ప్రాణవాయువును అందిస్తాయన్నారు. ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. సూపర్‌వైజర్ అనురాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరులో..

పొందూరు: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పొందూరు జ్యుడీషయల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు సూపరింటెండెంట్ సత్యనారాయణ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. మానవ మనుగడకు, వాతావరణ సమతుల్యానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. న్యాయవాదులు బ్రహ్మాజీ, రామ్మోహన్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



నరసన్నపేట: కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయవాదులు

మెళియాపుట్టిలో..

మెళియాపుట్టి: పచ్చదనంతోనే పుడమికి, పంచభూతాలకు రక్షణ కలుగుతుందని మండలంలోని చాపర త్రిలోక్ భవన్‌కు చెందిన ఓంశాంతి బ్రహ్మకుమారీలు అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చాపర గ్రామంలోని గ్రామదేవత ఆలయం, గ్రామంలోని పలు చోట్ల మొక్కలను నాటారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఎంఈఓ దేవేంద్రరావు, పలువురు విద్యార్థినులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నరసన్నపేట: సత్యవరంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

హిరమండలంలో..

హిరమండలం: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎమ్మార్సీ కార్యాలయం వద్ద మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సీఆర్ఎంటీలు, ఐఈఆర్టీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జలో..

బూర్జ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెద్దపేట ఆర్ప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు అన్నారు. మండలంలోని పెద్దపేట ఆర్ప్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో ఆవరణలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. మొక్కలు నాటించాలని, సహజ సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. వాసన్ ప్రతినిధి పాత్రో, మన్యం సీఈఓ బి.శంకరరావు, నూక అనూప్, సహజ వనరుల ఏఎఫ్‌పీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆమదాలవలస రూరల్: అక్కులపేట సత్యసాయి మందిరంలో మొక్కలు నాటుతున్న సభ్యులు



మెళియాపుట్టి: చాపరలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఓంశాంతి బ్రహ్మకుమారీలు



హిరమండలం: ఎమ్మార్సీ ఆవరణలో మొక్క నాటుతున్న ఎంఈఓ రాంబాబు



పాతపట్నం: మొక్కలు నాటుతున్న సీడీపీఓ విమలరాణి

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా



పాతపట్నం: మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా

నరసన్నపేట: జిల్లా వ్యాప్తంగా శాఖా గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చి సద్వినియోగం చేసుకుంటున్నారని గ్రంథాలయ జిల్లా కార్యదర్శి బి.కుమార్‌రాజా అన్నారు. డిప్యూటీ లైబ్రేరియన్ వి.శంకరరావుతో కలిసి నరసన్నపేట శాఖా గ్రంథాలయాన్ని బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నరసన్నపేటలో విద్యార్థులు అధిక సంఖ్యలు హాజరవుతున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. మే 15 నుంచి వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 7వతేదీ వరకు వేసవి శిబిరాలు ఉంటాయన్నారు. లైబ్రేరియన్ చాయరతన్ తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: పాఠకులు గ్రంథాలయాల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా అన్నారు. బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరావుతో కలిసి పర్యవేక్షించారు. విద్యార్థులను వేసవి శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.చక్రపతి, గ్రంథాలయాధికారి కాళ్ల రాజు, బి.బెనర్జీ, ఆనందరావు పాల్గొన్నారు.

భారీ వర్షం



జొన్నవలసలో కురుస్తున్న వర్షం.



దూసిలో ఇటుకలపై కప్పిన టార్పాలిన్లు

ఆమదాలవలస రూరల్: నైరుతి రుతుపవనాల రాకతో మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం బలమైన గాలులతోపాటు భారీ వర్షం కురిసింది. మునగవలస, జొన్నవలస, శ్రీహరిపురం, సైలాడ, గాజులకొల్లివలస, చిట్టివలస, కొత్తవలస, దూసి, తొగరాం గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. రైతులు పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు. వరి విత్తనాలు వేసుకునేందుకు ఈ వర్షాలు అనుకూలంగా ఉంటాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగుల బోగీల్లోకి సాధారణ ప్రయాణికులు!



యశ్వంత్‌పూర్ సూపర్‌ఫాస్ట్ రైలు దివ్యాంగుల బోగీలోకి ఎక్కుతున్న సాధారణ ప్రయాణికులు



సాధారణ ప్రయాణికులతో రద్దీగా ఉన్న దివ్యాంగుల బోగీ

కాశీబుగ్గ: వేసవి సెలవులు ముగుస్తుండడంతో రైళ్లలో ప్రయాణికుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో ఏసీ బోగీలు తప్పిస్తే జనరల్, రిజర్వేషన్ తేడా లేకుండా జనం కిక్కిరిసి ప్రయాణం చేస్తున్నారు. ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లకు ప్రారంభంలో ఉన్నటువంటి మహి, దివ్యాంగుల బోగీల్లో సాధారణ టిక్కెట్లు తీసుకున్నవారు ఎక్కేస్తున్నారు. దీంతో దివ్యాంగులు, మహిళా ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. రైల్వే ఉన్నతాధికారులు, టికెట్ కలెక్టర్, గార్డులు, ఆర్‌పీఎఫ్, స్పెషల్ స్క్వాడ్ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఇలా జరుగుతుందనే విమర్శలు వస్తున్నాయి. దివ్యాంగుల బోగీలో ప్రయాణానికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

జి.సిగడాం: గ్రామాల్లో వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జి.సిగడాం ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పేకల సుమబింధు సూచించారు. పెంట గ్రామ సచివాలయం హెల్త్ క్లినిక్‌లో రోగులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో మంచానికి పరిమితమైన రోగులకు ఇంటివద్దకు వెళ్లి వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. రోగలకు వైద్య పరీక్షలు చేసి మందులను అందించారు. సీహెచ్ఓ శివప్రసాద్ రావు, సూపర్‌వైజర్ భాస్కరరావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

13 నుంచి శివకామేశ్వర స్వామి వార్షికోత్సవాలు



శివ కామేశ్వరస్వామి

శ్రీకాకుళం కల్చరల్: మొండేటివీధిలోని లలితాదేవి సహిత శివకామేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు జరుగుతాయని షిర్డీసాయి సేవా సంఘం సభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 13న ఉదయం పందిరాట కార్యక్రమం, 15న ఉదయం అష్టోత్తర సహిత బిల్వార్చనలు, 16న ఉదయం సామూహిక మహన్యాస పూర్వ రుద్రాభిషేకాలు, 17న సాయంత్రం శివ పార్వతుల కల్యాణ మహోత్సవం జరుగుతోందని.. భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

అంతర పంటలతో అధిక లాభాలు



కుప్పిలిలో పండిస్తున్న అంతరపంటలు

ఎచ్చెర్ల: మండలంలోని కుప్పిలి, అజ్జరాం, ఎస్ఎస్ఆర్‌పురం, ఎచ్చెర్ల వంటి వర్షాధార ప్రాంతాల్లో అంతర పంటలకు రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. అంతర పంటల్లో భాగంగా ఒకేచోట పలు రకాల పంటలను వేయడం వల్ల ఒక పంటపోయినా మిగతా పంటలు పండటం వల్ల నష్టపోయే అవకాశం ఉండదని రైతులు అంటున్నారు. కొబ్బరి, ముల్లంగి, బెండ, మిరప, అరటి పంటలను ఒకేచోట వేసి పండిస్తున్నారు. దీనివల్ల తక్కువ భూమిలో తక్కువ పెట్టుబడితో పలు రకాల పంటలను పండించవచ్చని రైతులు అంటున్నారు.

రిమ్స్ అన్నపూర్ణకు రూ.10 వేల విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్ అన్నపూర్ణ నిత్య అన్నదాన పథకానికి విశాఖకు చెందిన డాక్టర్ కిల్లాన రఘుచాణక్య తన సతీమణి మోనికా పుట్టిన రోజు సందర్భంగా రూ.10 వేలు విరాళం బుధవారం అందించారు. ఈ మొత్తాన్ని సంఘం కార్యదర్శి ఫాల్గుణరావు ద్వారా సంఘ అధ్యక్షులు గంగుల రమణ బాబు, జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరరావులకు అందించారు.

'ఏఐ'తో ఉత్తమ భవిష్యత్తు

నరసన్నపేట: ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ)లో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు మాకేని సతీష్ అన్నారు. స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో ఇంటర్ తర్వాత విద్యావకాశాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ తర్వాత విద్యార్థులు ఎంచుకొనే మార్గంతోనే వారి భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఇప్పుడు డిగ్రీ, ఇంజినీరింగ్‌తోపాటు సాధారణ డిగ్రీలో కూడా అందుబాటులో ఉందన్నారు. డ్యూయల్ డిగ్రీతో కూడా విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని, ఆన్‌లైన్‌లో ఒక డిగ్రీ చేస్తూనే ఆఫ్‌లైన్‌లో మరొక డిగ్రీ పట్టా సాధించవచ్చన్నారు. ఏదైనా ఇంటర్ తరువాత మంచి కోర్సులను ఎంచుకోవాలని అభిప్రాయపడ్డారు. కళాశాల డైరెక్టర్ సి.హెచ్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సతీష్

నీట్‌లో పాతపట్నం విద్యార్థుల ప్రతిభ

పాతపట్నం: వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాల్లో పాతపట్నం ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన రెగేటి నీషిత్‌కు ఆలిండియా స్థాయిలో 43,212వ ర్యాంకు సాధించాడు. 720కి మార్కులకుగాను 635 మార్కులు సాధించాడు. తండ్రి రెగేటి భీమారావు ఆర్మీలో పని చేస్తున్నాడు, తల్లి భాగ్యలక్ష్మి గృహిణి, పాతపట్నం సెంటిన్స్ పాఠశాలలో పదో తరగతిలో 91 శాతం, ఇంటర్ విశాఖపట్నం నారాయణలో 90.8 శాతం సాధించాడు. పాతపట్నం శివశంకర్ కాలనీ-1 లైన్‌కు చెందిన బొమ్మాళి మౌనిక నీట్ ఆల్ ఇండియా స్థాయిలో 47,235వ ర్యాంకు సాధించింది. 720 మార్కులకు గాను 631 మార్కులు సాధించింది. తండ్రి బొమ్మాళి మురళీకృష్ణ వ్యాపారం చేస్తున్నారు. తల్లి మీనాక్షి గృహిణి, పాతపట్నం అమరజ్యోతి పాఠశాలలో పదో తరగతి 600కి గాను 580 మార్కులు సాధించింది. ఇంటర్ విశాఖపట్నం నారాయణలో 92 శాతం సాధించింది. మౌనికను అమరజ్యోతి ప్రిన్సిపాల్ సోమేశ్వరరావుతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.



రెగేటి సాయి నీషిత్



బొమ్మాళి మౌనిక

ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లపై ప్రచారం

కంచిలి: మండల కేంద్రం కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టడం కోసం కళాశాల ప్రిన్సిపాల్ వి.జగదీష్ ఆధ్వర్యంలో అధ్యాపకులు ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం మండలంలోని నారాయణబట్టి, గుండాం, కర్తలి, ఎం.ఎస్.పల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ చెప్పారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూప్‌లలో తెలుగు, ఒడియా, ఇంగ్లిష్ మీడియంలో బోధన కలదని, నామమాత్ర ఫీజులతో అత్యుత్తమ విద్యాబోధన అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. అధ్యాపకులు వేణుగోపాల్, వాసుదేవ్, బబిత పాల్గొన్నారు.



నారాయణబట్టి గ్రామంలో విద్యార్థులతో మాట్లాడుతున్న కళాశాల అధ్యాపకులు

టెక్ మహీంద్రాకు ఆదిత్య విద్యార్థులు ఎంపిక

టెక్కలి: టెక్ మహీంద్ర సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలకు టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎస్ఈ, ఈసీఈ, ఐటీ బ్రాంచ్‌లకు చెందిన 10 మంది విద్యార్థులు ఈ ఉద్యోగాలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్ఓడీలు యు.డి.ప్రసన్న,.విద్యార్థులను అభినందించారు.

ఆకట్టుకున్న సాంఘిక నాటకం

టెక్కలి: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం నిర్వహించిన సాంఘిక నాటకం ఆకట్టుకుంది. స్నేహితుడిలో వచ్చిన మార్పు అనే అంశంపై విద్యార్థులు వేసిన నాటకం విశేషంగా అలరించింది. గ్రంథాలయాధికారి బి.రూపావతి, విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయుడు మోహన్‌రావు పాల్గొన్నారు.